కలగానే డంపింగ్ యార్డు నిర్మాణం

- రోడ్ల పక్కన చెత్తను డంప్ చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది
- ఇబ్బందుల్లో విలియంపేటవాసులు

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట పట్టణ ప్రజలను చెత్త సమస్య వేధిస్తోంది. జగ్గయ్యపేట పురపాలక సంఘానికి డంపింగ్ యార్డు లేకపోవడంతో పారిశుద్ధ్య సిబ్బంది చెత్తాచెదారాలను పట్టణంలోని పలురోడ్ల పక్కన పడేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు.




ముక్త్యాల రోడ్డులో విలియంపేట వద్ద రోడ్డు పక్కనే కుప్పలుగా పడవేసిన చెత్తా చెదారం

ముక్కుమూసుకోవాల్సిందే..

తొర్రగుంటపాలెం మున్సిపాలిటీలో విలీనం కావడం, బలుసుపాడు రోడ్డులో కొత్తగా జగనన్న కాలనీ ఏర్పడటంతోపాటు రోజురోజుకు పట్టణ జనాభా పెరుగుతుండటంతో చెత్త కూడా అధికంగా వస్తోంది. పారిశుద్ధ్య సిబ్బంది నిత్యం పట్టణంలో 30టన్నుల వరకు చెత్తను సేకరిస్తున్నారు. కొంతకాలంగా పట్టణంలో సేకరిస్తున్న చెత్తను బలుసుపాడు రోడ్డులోని చిన్నేటి పక్కన, చిల్లకల్లు రోడ్డులో వైఎస్ సర్కిల్ నుంచి ముక్త్యాల రోడ్డు వరకు చెరువు ఒడ్డుకు ఆనుకుని ఉన్న బైపాస్ రోడ్డులో డంప్ చేస్తున్నారు. పదేళ్లుగా పట్టణంలోని ముక్త్యాల రోడ్డులో స్థానిక విలియంపేట–పద్మావతినగర్ మధ్యనున్న ఆయా సామాజిక వర్గాలకు చెందిన స్మశానవాటికలకు ఆనుకుని రోడ్డు పక్కన పాలేటి నదిఒడ్డున చెత్తను కుప్పలుగా పడవేస్తున్నారు. దీంతో స్థానిక విలియంపేట, పద్మావతినగర్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో సేకరిస్తున్న చెత్తాచెదారం, వ్యర్థాలను వాహనాలలో తీసుకొచ్చి ఇక్కడే గుట్టలుగా వేస్తుండటంతో పందులు, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. వ్యర్థాల నుంచి వెలువడుతున్న దుర్గంధంతో నివసించలేక పోతున్నామని పరిసర ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతంలో వెళ్లాలంటే ముక్కుమూసుకోక తప్పడం లేదని పట్టణ ప్రజలు చెబుతున్నారు.

కలుషితమవుతున్న పాలేటి నీరు..

పట్టణ ప్రజలకు మంచినీటిని అందించే పాలేటి నది ఒడ్డునే చెత్తను పడేస్తుండటంతో పాలేటిలో నీరు కలుషితం అందుతుందని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.విలియంపేటలోని స్మశానవాటికలో చెత్తను డంపింగ్ చేస్తుండటంతో దహన సంస్కారాలు చేసేందుకు స్మశానవాటికకు వచ్చేవారికి అవస్థలు తప్పడం లేదు. పలుమార్లు మున్సిపల్ సిబ్బంది చెత్తను దగ్ధం చేస్తుండటంతో తరచూ వచ్చే పొగ ఆ ప్రాంతంలో వ్యాపించడంతో ముక్త్యాల–జగ్గయ్యపేట రోడ్డులో దారి సరిగా కనిపించక వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు.

15ఏళ్లుగా ప్రతిపాదనలకే పరిమితం..

బలుసుపాడు రోడ్డులోని క్రిస్టియన్‌పేట–మిట్టగుడెం సమీపంలో 2008లో అప్పటి మున్సిపల్ పాలకవర్గం, అధికారులు డంపింగ్ యార్డు నిర్మాణానికి 5.16 ఎకరాల రెవెన్యూ స్థలాన్ని కొనుగోలు చేసేందుకు ప్రతిపాదనలు చేశారు. 2010 లో రెవిన్యూ శాఖకు రూ.29లక్షలు చెల్లించి ఆస్థలాన్ని మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం చేపట్టిన డంపింగ్‌యార్డు నిర్మాణ పనులను మిట్టగూడెం, క్రిస్టియన్‌పేట వాసులు అడ్డుకున్నారు.ఆస్థలంలో ఎకరం స్మశానస్థలం ఉందంటూ వారు అభ్యంతరం వ్యక్తంచేశారు. దీంతో ఈ స్థలం అంశం వివాదంగా మారడంతో అక్కడ డంపింగ్ యార్డు నిర్మాణ ప్రతిపాదనను 2012లో మున్సిపాలిటీ విరమించుకోవడం సమస్య మళ్లీ మొదటికొచ్చింది. అప్పట్నుంచి మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను పట్టణంలోని ఆయారోడ్లలో ఎక్కడిపడితే అక్కడే పడేస్తుండటంతో రోగాలు వ్యాప్తి చెందుతున్నాయని ఆయా కాలనీలవాసులు ఆందోళనచెందుతున్నారు. ఇకనైనా మున్సిపల్ పాలకులు తగిన చర్యలు తీసుకుని డంపింగ్ యార్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రోగాలు వస్తున్నాయి..



ముక్త్యాల రోడ్డులో రోడ్డు పక్కనే స్మశాన స్థలంలో చెత్త వేస్తుండటంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. దుర్వాసనతోపాటు దోమలు, పందులు బెడద ఎక్కువైంది. దీంతో డెంగీ, గున్యా వంటి వ్యాధులు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి ఇక్కడ నుంచి చెత్త డంపింగ్‌ను వేరే ప్రాంతానికి తరలించాలి.

– ఉప్పెల్లి ఏసేబు, విలియంపేట నివాసి

ఆందోళన చేపడతాం..



జనవాసాల మధ్య చెత్తను పడేస్తుండటంతో చెత్తాచెదారం, వ్యర్థాలతో ఈ ప్రాంతమంతా అధ్వానంగా తయారైంది. రెవెన్యూ, మున్సిపల్‌శాఖల అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో డంపింగ్‌యార్డు నిర్మాణ సమస్య అలాగే ఉంది. చెత సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించకుంటే ప్రజాసంఘాలతో కలిసి పోరాటం చేస్తాం.

–చెరుకుమల్లి నాగేశ్వరరావు, విలియంపేట వాసి

చెత్త రీసైక్లింగ్ చేస్తాం



ఇప్పుడు చెత్త డంపింగ్ చేస్తున్న స్థలంలోనే చెత్తనంతా లెగసీ వేస్ట్ ప్రాసెస్ ప్రక్రియ ద్వారా రీసైక్లింగ్ చేస్తూ స్థలాన్ని ఖాళీగా చూపిస్తారు. తడిచెత్తను పొలాలకు ఎరువుగా, పొడిచెత్తను కంపోస్టు ఎరువుగా తయారుచేస్తారు. ఈ విధానంపై ఇప్పటికే ఓ సంస్థతో ఒప్పందం చేసుకున్నాం. త్వరలోనే పనులు ప్రారంభవుతాయి. దీంతో చెత్తకుప్పలు కనిపించవు.

– ఎం.రామ్మోహనరావు, మున్సిపల్ కమిషనర్

21మంది ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

జగ్గయ్యపేట: జగ్గయ్యపేట మండలంలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన 21మంది సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎంపీడీవో నితిన్ శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. శనివారం మధ్యాహ్నంలోగా సమాధానం ఇవ్వాలని నోటీసుల్లో ఆదేశించారు. మండలంలోని చిల్లకల్లు, తిరుమలగిరి గ్రామాల్లో పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీ,రాం తాతయ్య పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. పింఛన్ల పంపిణీకి సంబంధించి మధ్యాహ్నం వరకు సర్వర్లు సరిగా పనిచేయకపోవడంతో పింఛన్‌దారులు ఇబ్బందిపడ్డారు. వేదాద్రి, పోచంపల్లి, అన్నవరం, బలుసుపాడు, గౌరవరం, కెఅగ్రహారం, జయంతిపురం గ్రామాల్లో పింఛన్‌దారులకు రూ. 100వరకు రూ.10ల నాణేలను అందించడంతో ఈ నాణేలను ఎలా మార్చుకోవాలంటూ లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

84శాతం పింఛన్లు పంపిణీ

వత్సవాయి: మండలంలో శుక్రవారం పింఛన్ల పంపిణీ 84శాతం పూర్తయినట్లు ఎంపీడీవో నంబూరి రాంబాబు తెలిపారు. ఉదయం కొంత సేపు సర్వర్ పనిచేయక పింఛన్ల పంపిణీ నిలిచిపోయింది. అనంతరం కొద్దిసేపటికి సర్వర్ పనిచేయడంతో ఆయా సచివాలయాల సిబ్బంది లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 9599 పింఛన్లు ఉండగా 8065మందికి పింఛన్లను పంపిణీ చేసినట్లు ఎంపీడీవో వివరించారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు:మండలంలోని 22 గ్రామపంచాయతీల పరిధిలో 90శాతం మేర పింఛన్‌లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో అరుంధతీదేవి తెలిపారు. మండలంలోని జుజ్జూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ 8,755 మందికి గాను 7,900ల మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు వివరించారు. మిగిలిన వారికి శనివారం పింఛన్లు పంపిణీ చేస్తామని తెలిపారు.

క్లుప్తంగా

రేపు వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడుగా దేవినేని అవినాష్ నియమితులైన సందర్భంగా ఆయన పదవీ బాధ్యతల స్వీకారంతోపాటు పార్టీ జిల్లా నాయకులు, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం విజయవాడలో ఆదివారం ఉదయం తొమ్మిదిగంటలకు జరుగుతుందని ఆపార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు తెలిపారు. విజయవాడ బెంజ్‌సర్కిల్‌లోని శేషసాయి కళ్యాణ మండపంలో నిర్వహించే ఈసమావేశానికి పార్టీ తరఫున ఎన్నికైన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, సోషల్‌మీడియా మిత్రులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

కబడ్డీ పోటీలు



నందిగామటౌన్:దీపావళి పండుగ సందర్భంగా మండలంలోని కొణతమాత్మకూరులో గురువారం కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈపోటీలను రిటైర్డు సబ్ కలెక్టర్ వేజెండ్ల రవీంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొంటే మానసికోల్లాసంతోపాటు శారీరక దారుఢ్యం కలుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడలను, క్రీడాకారులను ప్రొత్సహించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఈపోటీలకు మండలంలోని దాములూరు, తొర్రగుడిపాడు, కొణతమాత్మకూరు గ్రామాలకు చెందిన క్రీడాకారులతో కూడిన 12 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు తొర్రగుడిపాడు సర్పంచ్ చెరుకూరు హైమారావు నగదు బహుమతి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మేడా కోటేశ్వరరావు, నాయకులు జవ్వాజి భాస్కరరావు, మేడా రాధకృష్ణమూర్తి, వినయ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు అరికట్టాలి



పెనుగంచిప్రోలు: బాల్య వివాహాలు అరికట్టాలని ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీభార్గవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం బాలల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీఓతోపాటు ఎంపీడీఓ జి.శ్రీను, డీసీపీఓ ఎం.రాజేశ్వరరావు మాట్లాడుతూ బాల్య వివాహాల కారణంగా కలిగే అనర్థాలతోపాటు నష్టాలను వివరించారు. పిల్లల హక్కుల చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి సృజన, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి: ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీ భార్గవి, జిల్లా ప్రాజెక్ట్ బాలల అధికారి రాజేశ్వరరావు సూచించారు. వత్సవాయిలోని శ్రీవెంకటేశ్వర హైస్కూల్‌లో శుక్రవారం బాలల చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటియువత చట్టాలపై అవగాహన లేకపోవడంతో నేరచరితులుగా మిగిలిపోతున్నారన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు ఏమి చేస్తున్నది ఓ కంట కనిపెడుతూ ఉండాలని సూచించారు. అసిస్టెంట్ సీడీపీవో నాగమణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మి, బేబిజాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి ఘననివాళి



కంచికచర్ల: కాంగ్రెస్‌పార్టీ నందిగామ నియోజకవర్గ ఇన్‌చార్జి మందా వజ్రయ్య ఆధ్వర్యంలో గురువారం ఇందిరాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. స్థానిక ఇందిరాగాంధీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు సూదుల పూర్ణచంద్రరావు, గోగినేని వెంకటేశ్వరరావు, తమ్మిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కంటైనర్ చెక్‌పోస్టులు ఏర్పాటు



జగ్గయ్యపేట: మండలంలోని తెలంగాణ సరిహద్దు గ్రామాల వద్ద చిల్లకల్లు ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం కంటైనర్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. గరికపాడు, బూదవాడ, అన్నవరం, ముక్త్యాల, మల్కాపురం, గంగ్రాయి గ్రామాలలో కంటైనర్ చెక్‌పోస్టులు ప్రత్యేక ప్రొక్లెయిన్‌ల ద్వారా ఏర్పాటు చేశారు. ఇసుక, మద్యం అక్రమరవాణాను అడ్డుకునేందుకు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఘనంగా దీపావళి వేడుకలు



శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో దీపాలంకరణ



గురుధాంలో నిర్వహిస్తున్న దీపావళి వేడుకలు



పేట ఇంటిగ్రిటీ బాలికల హాస్టల్‌లో దీపావళి వేడుకలు

పెనుగంచిప్రోలు:దీపావళి వేడుకలను పెనుగంచిప్రోలు మండల ప్రజలు ఘనంగా నిర్వహించారు. లక్ష్మీదేవి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో దీపావళి సందర్భంగా ఓం ఆకారంలో భారీగా దీపాలు అలంకరించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు, ఆలయ అర్చకులు, పురోహితులు, ఆలయ సిబ్బంది, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గురుధాంలో ..

బలుసుపాడు(జగ్గయ్యపేట):గురుధాం ఆశ్రమంలో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తాత్వికుడు గెంటేల వెంకట రమణ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చుతూ వేడుకలు జరుపుకున్నారు.

నందిగామలో..

నందిగామటౌన్: విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపాల పండుగ దీపావళిని నందిగామ పట్టణంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఇళ్ల లోగిళ్లను ప్రత్యేకంగా రంగవల్లులతో అలంకరించి దీపాలు వెలిగించి లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. టపాసులు కాల్చి అమావాస్య చీకట్లను పారద్రోలారు. చిన్నా, పెద్దా, మహిళలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరు బాణాసంచా కాల్చి పండుగను సంతోషంగా జరుపుకున్నారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్: పట్టణ ప్రజలు దీపావళి పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. టపాసులు కాల్చారు. ఆలయాల్లో పూజలు చేశారు. పట్టణంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎస్ఐ వెంకటేశ్వరరావు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది అన్ని ప్రాంతాలను పర్యవేక్షించారు.

వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే..

పట్టణంలోని బలుసుపాడు రోడ్‌లో ఉన్న డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, సత్యనారాయణపురంలోని ఎస్టీ బాలుర గురుకుల పాఠశాల, ఎస్సీ బాలుర హాస్టల్, జెడ్పీ బాలుర హైస్కూల్ గ్రౌండ్‌లో ఉన్న ఇంటిగ్రిటీ బాలికల హాస్టల్‌లో విద్యార్థులు దీపావళి పండుగను జరుపుకున్నారు. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)బలుసుపాడురోడ్‌ని బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులకు దీపావళి టపాసులు, మతాబులు అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. బాలికల, ఎస్టీ బాలుర గురుకులాల ప్రిన్సిపాల్స్ సుజాత, ఉమేష్‌బాబు, వార్డెన్లు సుల్తానా, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది



నందిగామలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ జగన్‌మోహనరావు,నాయకులు



పేటలో పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు



పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, నాయకులు

నందిగామటౌన్: ఆంధ్రరాష్ట్ర అవతరణలో పొట్టి శ్రీరాములు కృషి చారిత్రాత్మకమైనదని నందిగామ మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు కొనియాడారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగంతోనే తెలుగురాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. రాష్ట్ర విభజనతో అప్పటి ప్రభుత్వాలు అవతరణ దినోత్సవాన్ని మార్చినప్పటికీ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మాత్రం నవంబరు ఒకటవ తేదీకే కట్టుబడి ఉందని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనూ అధికారికంగా రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నిర్వహించిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు నెలకుదిటి శివనాగేశ్వరరావు, సూరె రామారావు, పారుపల్లి హరిబాబు, చిలుకూరి బుచ్చిరెడ్డి, ఓర్సు జ్వాలా, షేక్ కరిముల్లా, కన్నెకంటి జీవరత్నం, నంద్రు శ్రీరామ్మూర్తి, షేక్ యాకుబ్ అలీ, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్: ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను జగ్గయ్యపేట పట్టణంలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఆయా రాజకీయ పార్టీలు, సంఘాల నాయకులు స్థానిక జమ్మిచెట్టు సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ కూడలిలోని పొట్టిశ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో...

తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలంటూ ఆత్మబలిదానంతో రాష్ట్రాన్ని సాధించిన అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయసాధనకు ప్రతి ఆంధ్రుడు కృషిచేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని స్థానిక జమ్మి చెట్టు సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పార్టీ నేతలతో కలిసి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పొట్టిశ్రీరాములు త్యాగం మరువలేనిదని పేర్కొన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా ఫిరోజ్, కౌన్సిలర్ వట్టెం మనోహర్, పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు చౌడవరపు జగదీష్, విజయవాడ కనకదుర్గ అమ్మవారి దేవస్థానం డైరెక్టర్ నంబూరి రవి, సర్పంచ్ సూరిబాబు, న్యాయవాది సత్యశ్రీనివాస్, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఉప్పెల్లి పెంటయ్య, కార్మిక సంఘం అధ్యక్షుడు గోగుల వెంకయ్య, నాయకులు పింగళి నర్సింహారెడ్డి, మన్నె అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో..

రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పట్టణ టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక జమ్మిచెట్టు సెంటర్‌లోని పొట్టిశ్రీరాములు విగ్రహానికి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ తెలుగు రాష్ట్రం కోసం, ప్రజల కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి అసువులు బాసిన త్యాగమూర్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక అప్సరా థియేటర్ రోడ్, బస్టాండ్ సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహాలకు జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ పార్కులో టీడీపీ ఫ్లెక్సీ!?

దగ్గరుండి ఫ్లెక్సీ కట్టించిన పోలీసులు

చందర్లపాడు (నందిగామ టౌన్): టీడీపీ నేతలు ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడుతున్నారు. 2009లో గ్రామపంచాయతీ అనుమతితో ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం కాంద్రపాడు గ్రామంలో నిర్మించిన వైఎస్సార్ పార్కులో గురువారం ఫెన్సింగ్ తొలగించి టీడీపీ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు అక్కడకు చేరుకుని ఫ్లెక్సీ తీయాలని టీడీపీ గ్రామఅధ్యక్షుడు రోశిరెడ్డిని కోరగా 'మీరంతా రెడ్‌బుక్‌లో ఉన్నారు జాగ్రత్తగా ఉండండి' అంటూ కర్రలు, కత్తులు, గడ్డపారలతో దాడికి యత్నించారు. 'ఈ స్థలంలో ఎన్టీ రామారావు విగ్రహం పెడుతున్నాం. ఏం చేసుకుంటారో చేసుకోండి' అంటూ రెచ్చగొట్టారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. 'కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. వారు చెప్పింది చేయాల్సిందే. కాదంటే మీపైనే కేసులు నమోదు చేస్తాం' అంటూ పోలీసులు ఏకపక్షంగా హెచ్చరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పోలీసులు అక్కడే పహారా కాస్తూ దగ్గరుండి టీడీపీ ఫ్లెక్సీలు కట్టించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం

చిల్లకల్లు(జగ్గయ్యపేట):వచ్చే సంక్రాంతి నాటికి పల్లె పండుగలో భాగంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూమి పూజ చేసిన అభివృద్ధి పనులను జనవరి నాటికి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నితిన్, ఏపీఎం రామకృష్ణ, ఈసీ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్‌అసిస్టెంట్ల చేతివాటం

వీరులపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల్లో పలువురు ఫీల్డ్‌అసిస్టెంట్లు చేతివాటం ప్రదర్శించారు. ప్రజావేదికలో గుర్తించిన లోపాల్లో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సదరు ఫీల్డ్‌అసిస్టెంట్ల నుంచి రికవరీలు చేస్తున్నట్లు ఏపీవో జనార్దన్ శుక్రవారం తెలిపారు. మండలంలోని పెద్దాపురంలో రూ.30,178, బోడవాడలో రూ.48,152, గోకరాజుపల్లి రూ.3,594, జయంతిలో రూ.2,483, గూడెంమాధవరంలో రూ.76,925, కొణతాలపల్లిలో రూ.71,288, నరసింహారావుపాలెంలో రూ.1,227, దొడ్డదేవరపాడులో రూ.9,128, చౌటపల్లిలో రూ.4,762, చట్టన్నవరం రూ.1500, నందలూరులో రూ.1,15,639, అల్లూరులో రూ.3వేలు, జగన్నాధపురంలో రూ.3వేలు, చెన్నారావుపాలెంలో రూ.46,437, జుజ్జూరులో రూ.64,860, పొన్నవరంలో రూ.వెయ్యి, దాచవరంలో రూ.3,633, వీరులపాడులో రూ.33,140, తాటిగుమ్మిలో రూ.7,725 స్వాహా అయినట్లు గుర్తించామన్నారు. ఈ మేరకు సదరు ఫీల్డ్‌అసిస్టెంట్ల నుంచి రికవరీ చేస్తున్నట్లు ఏపీవో వివరించారు. బోడవాడ గ్రామాలలో విచారణ నిర్వహించటం జరుగుతుందని చెప్పారు.

వల్లభాయ్ పటేల్‌కు ఘననివాళి

నందిగామటౌన్: ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని బీజేపీ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పటేల్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. నియోజకవర్గ కన్వీనర్ తొర్లికొండ సీతారామయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటినుంచి కార్తిక మాసోత్సవాలు

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో కార్తిక మాసంలో ఆదివారాల్లో ప్రత్యేక అలంకరణ చేయనున్నట్లు ఈవో నాగకిషోర్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఈనెల3న పూల అలంకరణ, 10న దీపాల అలంకరణ, 17న పండ్ల అలంకరణ, 24న గాజుల అలంకరణ, డిసెంబర్ 1న విశేష అలంకరణ ఉంటుందని వివరించారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి: కార్తికమాస ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబవుతున్నాయి. వత్సవాయి, పోలంపల్లి, కంభంపాడు, చిట్టేల, కన్నెవీడు, ఇందుగపల్లి, మక్కపేట, భీమవరం, గ్రామాల్లో కార్తీక మాసోత్సవాలకు ఆయా శివాలయాలు ముస్తాబయ్యాయి.

ముక్తేశ్వరుడికి ప్రత్యేక పూజలు..

ముక్త్యాల(జగ్గయ్యపేట): భవానీ ముక్తేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా నెలరోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఈవో సురేష్‌బాబు శుక్రవారం తెలిపారు.

పాలేటి బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టాలి : సీపీఐ

గరికపాడు(జగ్గయ్యపేట): తెలుగు రాష్ట్రాల సరిహద్దులోని పాలేటి బ్రిడ్జికి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. పాలేటి బ్రిడ్జిని సీపీఐ నాయకులు జూనెబోయిన శ్రీనివాసరావు, ఆంబోజి శివాజీ, మహ్మద్ గురువారం సందర్శించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వరదలకు పాలేటి బ్రిడ్జి దెబ్బతిని నెలరోజులు గడిచినా నేషనల్ హైవే అథారిటీ అధికారులు నేటివరకు పట్టించుకోలేదని విమర్శించారు. పాలేటి బ్రిడ్జి, రహదారికి మరమ్మతులు చేపట్టకపోవడంతో ఇటీవల ప్రమాదం చోటుచేసుకుని ముగ్గురు వ్యక్తులు మృతిచెందారని ఆందోళన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున నష్టపరిహారం అందించాలని వారు డిమాండ్ చేశారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ



జగ్గయ్యపేట అర్బన్: గజియాబాద్‌లో న్యాయవాదులపై పోలీసుల అక్రమ లాఠీచార్జిని ఖండిస్తూ జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం కోర్టు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తంచేశారు. నిరసన కార్యక్రమంలో న్యాయవాదులు బత్తుల వెంకట్రామయ్య, కరణం నరసింహారావు, పసుపులేటి సత్యశ్రీనివాసరావు, ఎం.కృష్ణయ్య, జి. శ్రీనివాసగౌడ్, ఎం.ఆంజనేయులు, కె.శ్రీనివాసరావు, పూల నాగరాజు, రావూరి ప్రసాద్, దాసరి నాగేశ్వరరావు, కరిసె రత్నబాబు, శ్రీధర్, అశోక్ పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామటౌన్: ఘజియాబాద్ ఘటనను నిరసిస్తూ విజయవాడ బార్ అసోసియేషన్ పిలుపు మేరకు న్యాయవాదులు శుక్రవారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. నిరసన కార్యక్రమంలో న్యాయవాదులు బండి మల్లికార్జునరావు, అద్దంకి మణిబాబు, ఎర్రంరెడ్డి బాబురావు, హనుమంతరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.